క్లుప్తంగా

అనుమతి ఇవ్వాలి



ఐబీఈఈ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సత్తుపల్లి: సత్తుపల్లిలోని వేశ్యకాంత చెరువులోని మట్టిని రైతు పొలాల్లోకి తోలుకోవడానికి అనుమతి ఇవ్వాలని నీటిపారుదల శాఖ ఈఈ ఎస్.శ్రీనివాసరెడ్డికి తెలంగాణ రైతు సంఘం సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకుడు రావుల రాజబాబు మాట్లాడుతూ.. చెరువులో పూడిక తీసి పొలాల్లోకి తొలడం వల్ల రైతాంగానికి, అలాగే భూగర్భ జల నీటిమట్టం పెరగడానికి ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో జాజిరి శ్రీనివాస్, కొలికపోగు సర్వేశ్వరరావు, రైతులు రాములు, సత్యం, రావి రాజా, జ్వాలయ్య, చింతనిప్పు బాబురావు, పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్స్ డే



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

మధిర: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు మధిర డిపోలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం డిమాండ్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ డిపో కార్యదర్శి వెంకన్న మాట్లాడుతూ.. మూడు నెలలు గడిచినప్పటికీ కార్మికులకు బాండ్ డబ్బులు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల్లో కార్మికులు నిరసన బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైనట్లు పేర్కొన్నారు.

మోడల్ ఎంసెట్‌ను జయప్రదం చేయండి

వైరా: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి నాలుగు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే మోడల్ ఎంసెట్ పరీక్షలో ఇంటర్ విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆ సంఘం వైరా డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు పుప్పాల నాగరాజు, కోట ప్రేమ్‌కుమార్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం వైరాలో జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మోడల్ ఎంసెట్‌కు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. నాయకులు అజయ్, హేమంత్, గణేష్ పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ కేవీ శ్రీనివాస్

వైరా: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా డ్వాక్రా మహిళలు గ్రామాల్లో అవగాహన కల్పించాలని వైరా తహసీల్దార్ కేవీ శ్రీనివాస్ సూచించారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో మంగళవారం డ్వాక్రా సంఘాల నేతలకు ఆయన ఓటింగ్‌పై అవగాహన కల్పించి మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా మహిళలు పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొనాలన్నారు. డీపీఎం శ్రీనివాస్ ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కారేపల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని కారేపల్లి బీసీ కాలనీకి చెందిన బట్టు చంద్రకళ, భారత్‌నగర్ కాలనీకి చెందిన మైప వీరయ్య ఇంటిపై కప్పు, గోడలు కూలిపోయాయి. దీంతో కారేపల్లి జామే మసీద్ మాజీ అధ్యక్షుడు షేక్ గౌసుద్దీన్ మంగళవారం వారికి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో రవీందర్, ఎండీ ఖలీలుల్లాఖాన్, సోమందుల నాగరాజు, సావిత్రి, సమ్మయ్య, వెంకన్న, నాగేశ్వరరావు, ముత్తయ్య పాల్గొన్నారు.

ఇసుక నిల్వలు సీజ్

ముదిగొండ: మండలపరిధిలోని పెద్దమండవలో అక్రమంగా నిల్వఉంచిన ఇసుక నిల్వలను ముదిగొండ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి సీజ్ చేశారు. ఇసుక అక్రమంగా నిల్వచేశారని సమాచారం రావడంతో.. మంగళవారం దాడులు నిర్వహించి ఆరు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం గ్రామానికి చెందిన కాపర్తి సతీష్ ఈ నెల 9న సెల్‌ఫోన్ పోయిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ యాప్ ద్వారా ట్రేస్ చేసి పోయిన ఫోన్‌ను గుర్తించి మంగళవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. కార్యక్రమంలో బ్లూకోట్ కానిస్టేబుల్ ఉపేందర్‌కృష్ణ, సిబ్బంది ఉన్నారు.

చెరువు మట్టి.. చేనుకు పుష్టి



చెరువు మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

- భూసారం పెరుగుదలకు దోహదం
- చెరువుల్లో పెరగనున్న నీటి సామర్థ్యం



పొలంలో వేసిన మట్టి

బోనకల్: చెరువు మన్ను చేనుకు దన్నుగా మారుతుంది. సాధారణంగా గతంలో ఎండాకాలంలో నీరు ఎండిపోయినప్పుడు చెరువులో నుంచి మట్టిని తీసి, ఈ మట్టిని పొలాల్లో వేసుకునేవారు. ఇప్పుడు ఈ పద్ధతిని పాటించేవారు లేరు. కాని దీని వలన రెండు రకాలుగా ప్రయోజనం కలుగుతుంది. వర్షాలు పడినప్పుడు ఆ నీటితో కలిసి పోషక విలువలు కలిగిన సారవంతమైన మట్టి మొత్తం వచ్చి చెరువులోకి చేరుతుంది. ఈ మట్టితో చెరువు నిండుతుంది.

పెరగనున్న నీటి సామర్థ్యం..

వేసవిలో చేరువుల్లో నీరు తక్కువగా ఉండడం వలన మట్టిని పూడిక తీయడం వలన మళ్లీ వచ్చే ఏడాది నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. ఎక్కువ నీరు నిలిచే అవకాశం ఉంటుంది. తద్వారా నీటి లభ్యత పెరుగుతుంది. చెరువు నుంచి తీసిన ఈ సారవంతమైన మట్టి పొలాల్లో పోయడం ద్వారా ఆ పొలాలు సారవంతమైతాయి. చెరువు మట్టిలో ఎక్కువగా ఉండే పోషకాల వల్ల నత్రజని ఎక్కువగా అందుతుంది. దిగుబడి పెరుగుతుంది. చెరువు మట్టి లోతును బట్టి అందులోని పోషకాలు ఆదారపడి ఉంటాయి. ఇందులో ఆమ్లక్షార తత్వాలతో పాటు పురుగుల మందుల అవశేషాలు కూడా ఉండే అవకాశం ఉంటుంది.

భూసార పరీక్షలు చేయించాలి..

చెరువులోని మట్టిని సేకరించి పొలాలకు తరలించే ముందు భూసార పరీక్షలు చేసి తరలించడం మంచిది. ఇలా కనీసం రెండు, మూడేళ్లకు ఒకసారి పొలంలో మట్టిని నింపుకోవడం ద్వారా వర్షాల వల్ల నీటి కోతకు గురైన భూములకు చికిత్స జరుగుతుంది. చెరువు మట్టి వేయడం, పచ్చిరొట్ట పెంచడం, పశువుల పేడ ఉపయోగించడం వంటివి చేయడం ద్వారా భూమి గుల్లబారుతుంది. పోషకాలు పెరుగుతాయి. తద్వారా ఎరువుల వాడకం తక్కువగా ఉంటుంది.

చెరువు మట్టితో కలిగే ప్రయోజనాలు..

- చెరువు మట్టిని పొలాల్లో వేయడం ద్వారా ఆమ్ల, క్షార గుణాలతో తటస్థంగా మార్చుకోవచ్చు.
- నేల గుల్ల బారుతుంది.
- నేలలోని లవణాల ఘాడత తగ్గుతుంది. సూక్ష్మ, స్థూల పోషకాల స్థాయి పెరుగుతుంది.
- మట్టితో పాటు సేంద్రీయ ఎరువులు కూడా కలిపి పొలాల్లో వేయడం వలన రసాయనిక ఎరువుల వాడకాన్ని కూడా తగ్గించవచ్చు.
- మొక్కలు ఆరోగ్యంగా ఏపుగా పెరుగుతాయి.
- కలుపు, వర్షాబావ పరిస్థితులను కూడా ఎదుర్కునే శక్తిని నేలకు అందిస్తుంది.
- దిగుబడి పెరిగి రైతుకు ఆదాయం వస్తుంది.
- చెరువు మట్టిని సేకరించేందుకు ముందు పరీక్షలు చేయించుకోవాలి.
- చెరువు మట్టి పూడిక స్థాయి, లోతు విస్తీర్ణం గమనించాలి. ఇలా చెరువు మట్టి వల్ల రైతులకు మేలు జరుగుతుంది.

భూసారం పెరుగుతుంది...



చెరువు మట్టి తోలడం వలన భూసారం పెరుగుతుంది. రెండు ఎకరాల పొలానికి 200 ట్రాక్టర్ల మట్టిని తోలించాను. భూమిలో కలియదున్నడం వలన పంట ఏపుగా పెరుగుతుంది. ఒక్కసారి మట్టి తోలితే మూడు సంవత్సరాలు పనిచేస్తుంది.

– బొడ్డుపల్లి నాగచంద్రుడు, రైతు, ముష్టికుంట్ల

అధిక దిగుబడి వస్తుంది..



పొలానికి చెరువుమట్టి తోలడం వలన అధిక దిగుబడి వస్తుంది. పంటకు ఎరువుగా కూడా ఉపయోగపడుతుంది. భూమి ఎగుడు దిగుడు లేకుండా చదును చేయడం వలన నీరు నిలబడకుండా బయటకు పంపవచ్చు.

– పిల్లలమర్రి నాగేశ్వరరావు, రైతు, ముష్టికుంట్ల

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

సత్తుపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, బీఆర్ఎస్ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం సత్తుపల్లిలోని శ్రీలక్ష్మిప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం ఆయనా పాల్గొని మాట్లాడారు. తనను గెలిపించాల్సిన బాధ్యత యువతపై ఉందని, తన గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ.. యువజనులకు కేసీఆర్ ప్రభుత్వం పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించిందని, దేశంలోని ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి కేసీఆర్ నేతృత్వంలో జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి ప్రజలను చైతన్య పరిచి నామా నాగేశ్వరరావు గెలుపుకు విస్తృత ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు యాగంటి శ్రీనివాసరావు, ఎస్‌కె రఫీ, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, దొడ్డా శంకర్‌రావు, మట్టా ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థికి సర్టిఫికెట్ అందిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్

కొణిజర్ల: విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందించే నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తహసీల్దార్ తఫజల్ హుస్సేన్, ఎంపీడీఓ ఎ.రోజారాణి తెలిపారు. మండలంలోని చిన్నమునగాల పాఠశాలను మంగళవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల చివరి పనిదినం కావడంతో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందించారు. అనంతర పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పరిశీలించి త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం యం.రమేష్ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటరావు, బీఎల్ఓ నిరోష పాల్గొన్నారు.

వైద్యుడిని కొనసాగించాలి

మధిర: మడుపల్లి బస్తీ దవాఖానాలో ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా వైద్యుడిని కొనసాగించాలని సీపీఐ మధిర మండల కార్యదర్శి కొండలరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం బస్తీ దవాఖానలో వైద్యసేవలు అందించేందుకు వచ్చిన ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్ పృథ్వీ నాయక్‌ను సీపీఐ బృందం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రజలకు వైద్య సేవలు అందాయని, ప్రస్తుతం వైద్యుడు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించకపోతే త్వరలోనే పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో అన్నవరపు సత్యనారాయణ, అప్పారావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

వైరారూరల్: మండలంలోని పాలడుగు గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు బోనకల్ మండలం సీతానగరం గ్రామానికి చెందిన రామినేని హనుమంతరావు, శ్రీనివాసరావులు వారి తల్లిదండ్రులు భద్రయ్య, సుగుణమ్మల జ్ఞాపకార్థం రూ.10 వేలు విలువ చేసే నోట్ పుస్తకాలు, పెన్నులు, అల్పాహారాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చావా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రావినూతల హైస్కూల్‌లో..

బోనకల్: మండలంలోని రావినూతల హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థులకు ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో.. క్రై సంస్థ సహకారంతో డిక్షనరీలు, జీకే పుస్తకాలు, ప్యాడ్స్, అట్లాస్‌లు, జామెంటరీ బాక్స్‌లను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ పుల్లయ్య మాట్లాడుతూ.. పిల్లలకోసం, పిల్లల హక్కుల కోసం పాటుపడుతున్న ఎఫర్ట్ సంస్థ కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ ఎ.విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నారాయణరావు, ప్రమీల, సురేష్, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం..

తల్లాడ: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి వినోద్‌రావును గెలిపించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి మున్నా మిశ్రా, మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు అన్నారు. మంగళవారం మండలంలోని అన్నారుగూడెం, మల్లారం, మిట్టపల్లి, వెంగన్నపేట గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు. బీజేపీ మండల కార్యదర్శి కృష్ణారావు, నాయకులు సుధాకర్, రామారావు, రవితేజ, నాగేశ్వర్‌రావు, నరేష్, నరసింహారావు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్యకు పరిష్కారం



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ అధికారులు

మధిరరూరల్: జిలుగుమాడు దళిత కాలనీలో కొంత కాలంగా ఉన్న విద్యుత్ లో ఓల్టేజీ సమస్యను మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు పరిష్కరించారు. అధిక విద్యుత్ వాడకంతో ఏర్పడుతున్న లో వోల్టేజీ సమస్యను అధిగమించే ప్రక్రియలో భాగంగా నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ వైరా డివిజన్ డీఈఎస్ కృష్ణ మాట్లాడుతూ.. మధిర మున్సిపాలిటీ పరిధిలో లో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా ఎక్కడికక్కడ నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మధిర సబ్ డివిజన్ ఏడీఈ ఎం.అనురాధ, రూరల్ ఏఈ కె.నాగేశ్వరరావు, పట్టణ ఏఈ ఎస్.అనీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం

మధిర: మధిర పట్టణంలోని మదర్ థెరిస్సా మానసిక వికలాంగుల సేవాసదనంలో దివ్యాంగులకు అన్నదానం చేశారు. మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా ఇల్లందులపాడు ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సూర్యదేవర కోటేశ్వరరావు ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ చావా శివాజీ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో..

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని అయ్యగారిపేట ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు, డీసీసీబీ డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య, జాన్సీరాణి దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ప్రసాద్, నరుకుళ్ల శ్రీను, మధు, వల్లభనేని పవన్ పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల పూజలు



అంకమ్మ తల్లిని దర్శించుకుంటున్న మంత్రి

సత్తుపల్లి: మండల పరిధి బేతుపల్లిలో అంకమ్మ తల్లి తిరునాళ్లు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం రాత్రి అంకమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం స్థానికులతో ఆయన పలు అంశాలపై మాట్లాడారు.

గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

మధిరరూరల్: ఆత్కూరు సమీపంలో ఉన్న శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్‌లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపాల్ బి.అంజన్ బాబు మాట్లాడుతూ.. మధిర ప్రాంత విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు అవసరమైన విజ్ఞానాన్ని అందించే ముఖ్య ఉద్దేశంతో శ్రీనిధి పాఠశాలను స్థాపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చందు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహాదేవపురం విద్యార్థుల ప్రతిభ

మధిర: మహాదేవపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటి గురుకుల విద్యాలయాల్లో సీట్లు సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం వీరయ్య తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు నల్లపు జనిత్, కనపర్తి అభినయశ్రీ, మర్సకట్ల రాకేష్, గ్యార లోకేష్ లను ఉపాధ్యాయులు లక్ష్మణ్, కరుణ, ధనిశెట్టి భాస్కరరావు, రవికుమార్ అభినందించారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

కారేపల్లి: మండలంలోని మాధారం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం పఠనోత్సవ పోటీలు నిర్వహించారు. 212 పాఠశాల పనిదినాలకు గాను, 211 రోజులు పాఠశాలకు హాజరైన ముగ్గురు విద్యార్థులు వరుణ్, అభిషేక్, ఆదిత్యలకు పోత్రాహక బహుమతులను అందజేశారు. ఉక్తలేఖనం(డిక్టేషన్), పుస్తక పఠనం పోటీల్లో ప్రతిభచూపిన విద్యార్థులతో పాటు, 7వ తరగతి విద్యార్థి సాత్విక స్కూల్ టాపర్‌గా నిలవటంతో బహుమతులను అందించారు. ఉపాధ్యాయులు మల్లేశ్వరరావు, దామోదర్‌రావు, చైతన్య లక్ష్మి, భద్రు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన



మల్లవరం పోలింగ్ కేంద్రంలో ఆర్డీఓ రాజేందర్ గౌడ్

తల్లాడ: మండలంలోని పోలింగ్ స్టేషన్లను మంగళవారం కల్లూరు ఆర్డీఓ రాజేందర్ గౌడ్ పరిశీలించారు. మల్లవరం, రెడ్డిగూడెం, తల్లాడ, పినపాక, కేశ్వాపురం, రామానుజవరం, మిట్టపల్లి, నూతనకల్, ముద్దునూరు, కుర్నవల్లి, కలకొడిమ, బస్వాపురం, రంగంబంజర, మల్సూర్‌తండా, వెంగన్నపేట, బిల్లుపాడు, కొత్త వెంకటగిరి, తెలగవరం, రేజర్ల గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లలో వసతులను ఆర్డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల నాటికి అన్ని సౌకర్యాలతో స్టేషన్లు ఉండేలా తగు చర్యలు తీసుకువాలని సిబ్బందికి సూచించారు. విద్యుత్ సౌకర్యం, తాగు నీటి వసతి, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలతో కేంద్రాలు ఉండాలని పేర్కొన్నారు. ఇప్పటికే అన్ని కేంద్రాల్లో వసతులు సమకూర్చినట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎండీఓ చంద్రమౌళి, ఎంఈఓ దామోదరప్రసాద్, ఎస్ఓ తిరుపతరావు, ఆర్ఐలు బాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ముదిగొండ: మండలంలోని అమ్మపేటలో స్వయంభుగా వెలసిన శ్రీవెలగొండ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రభాత సేవ, నిత్యహోమం, నీరాజన మంత్ర పుష్పం, స్వామివారి ఎదుర్కోలు మహోత్సవం కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు గుంటూరు శేషాచార్యులు, గుంటూరు వెంకటరమణాచార్యులు, గుంటూరు పవనకుమారాచార్యులు, గుంటూరు పద్మనాభాచార్యులు, హరికిరణాచార్యులు, బొర్రా శ్రీనివాసాచార్యులు ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని భక్తులు భక్తులు భక్తిశ్రద్ధలతో తిలకించారు. పలువురు భక్తులు పీటలపై కూర్చున్నారు.

ముత్యాలమ్మకు బోనాలు



బోనాలతో ప్రదర్శనగా వెళ్తున్న మహిళా భక్తులు

కారేపల్లి: మండలంలోని భాగ్యనగర్‌తండా, పాతకమలాపురం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన బొడ్రాయి, ముత్యాలమ్మ విగ్రహాలకు మంగళవారం బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళా భక్తులు బోనాలను నెత్తిన పెట్టుకొని మేళతాళాల నడుమ ప్రదర్శనగా బయలుదేరి బోనాలు సమర్పించారు. దీంతో ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం సంతరించుకుంది. కార్యక్రమాలను ఎంపీటీసీ సభ్యుడు ఈశ్వరీనందరాజ్, ధరావత్ పాండ్యానాయక్, మాజీ సొసైటీ అధ్యక్షుడు అప్పారావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

గ్రామ ప్రభ ఊరేగింపు



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని బేతుపల్లి గ్రామంలోని శ్రీఅంకమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవాల సందర్భంగా మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి గ్రామ ప్రభ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు నీళ్ల వారపోసి దీపధూపనైవేద్యాలతో పూజలు నిర్వహించారు. భక్తులు మేళతాళాలు.. డబ్బు వాయిద్యాలతో గండ దీపాలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

సదాశివునిపేటలో..

మండల పరిధిలోని సదాశివునిపేట శ్రీఅంకమ్మతల్లి, శ్రీమహాలక్ష్మితల్లి తిరునాళ్ల మహోత్సవాలు రెండో రోజు మంగళవారం జలబిందెలు, పూలకప్పెర కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రతిష్ఠ విగ్రహాలకు జలాభిషేకం



యాగశాలలో పూజలు చేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలో నిర్మించిన శ్రీదాసాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 26వ తేదిన ప్రతిష్ఠించనున్న దాసాంజనేయస్వామి, గణపతి, సుబ్రహ్మణస్వామి, జంట నాగుల విగ్రహాలకు మంగళవారం పలువురు భక్తులు జలాభిషేకం నిర్వహించారు. యాగశాలలో గ్రామ పురోహితులు కొత్తూరి వెంకట సీతారామశర్మ, రాజేశ్వరశాస్త్రి, పలువురు అర్చకులు శాస్త్రోక్తంగా హోమాలు, అనుష్ఠానాలు, చతురేద పారాయణం చేశారు. దేవతా విగ్రహాలను గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దొడ్డా అశోక్, గోగినేని సూరి, మగనం వీరభద్రం, జానకి శివ, దూదిగం పకీరయ్య,చిన్నా నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన గురువమ్మతల్లి జాతర

– తొలిరోజు అమ్మవారికి పసుపుకుంకుమ పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కారేపల్లి: మండలంలోని పేరుపల్లి గ్రామంలో కొలువుతీరిన శ్రీగురువమ్మతల్లి జాతర మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైందని.. ఆలయ కమిటీ చైర్మన్ పుట్టా నాగేశ్వరరావు తెలిపారు.

తొలిరోజు అమ్మవారికి నిత్యపూజలు, పసుపు కుంకుమ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ నెల 24వ తేదీన బలబిందెలు, 25న అమ్మవారి కల్యాణమహోత్సవం, 26న ఊరేగింపు, పూలకప్పెర, 27న గ్రామ ప్రభలు, 28న బోనాల సమర్పణతో జాతర ముగుస్తుందని చైర్మన్ పుట్టా నాగేశ్వరరావు పేర్కొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

వేంసూరు: మండలంలోని లింగపాలెంలో నిర్మించిన సీతారామచంద్రస్వామి, లక్ష్మణాంజనేయ, నూతన శిలాధ్వజ శిఖర జయ విజయ ముత్యాలమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా మంగళవారం సుప్రభాతసేవ, మంగళవాద్యం, యంత్ర మంత్రానుస్థానములు, పంచగ్రవ్య, క్షీరాధివాసం, కుంకుమార్చన, హోమములు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

తల్లాడ: తల్లాడలో హనుమాన్ శోభాయాత్ర మంగళవారం ఘనంగా నిర్వహించారు. లంకలో ఆంజనేయుడు సీతమ్మవారి జాడ కనుగొన్న రోజు సందర్భంగా.. భక్తులు శోభయాత్ర నిర్వహించారు. నారాయణపురం గ్రామంలోని కోదండ రామాలయం నుంచి హనుమాన్ జెండాలతో బయలుదేరి తల్లాడ సుబ్రమణ్యస్వామి ఆలయం, కృష్ణమందిరం, హనుమత్ పద్మావతి సమేత వేంకటేశ్వర ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో తల్లాడ పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణపు నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం పెన్షనర్ల సమస్యలపై స్థానిక తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావుతో పాటుగా రాష్ట్ర ఎగ్జిక్యూటీ మెంబర్, సత్తుపల్లి అధ్యక్షుడు కె.వైకుంఠరావు, ముఖ్య కార్యదర్శి ఎంఎస్ఆర్ శర్మ, గౌరవ అధ్యక్షుడు పద్మారావు, కోశాధికారి జీవీఎస్ సాయి పాల్గొని మాట్లాడారు. 30 పర్సెంట్ ఫిట్మెంట్‌తో పెన్షన్ సవరణ చేయాలన్నారు. ఎయిడెడ్, ఇతర పెన్షనర్లకు మెడికల్ రీఎంబర్స్‌మెంట్ వర్తింప చేయాలని, కనీసం పెన్షన్ రూ.30వేలు ఇవ్వాలని, మెడికల్ అలవెన్స్ రూ.3వేలుగా చేయాలన్నారు. అనంతరం చలివేంద్రం ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు.